# కథలూ కాకరకాయలూ

"ఇది పూర్తయ్యాక నాతో ఒక మాట మాట్లాడి వెళ్తావా కామేశం?"

పుర ప్రముఖుల్ని పరామర్శిస్తూ, అతిథులు డిన్నరు తీసుకున్నారో లేదో అడిగి తెలుసుకుంటూ, 'బఫే'లో లోపాలేవీ లేదు గదా అని వాకబు చేస్తూ, అంతటి సంరంభంలో గూడా ఎక్కడో దూరంగా నిల్చున్న నన్ను దగ్గరికి పిలిచి చెప్పారు రాజభూషణం గారు.

డాక్టర్లు, లాయర్లు, బ్యాంక్ మేనేజర్లు, పెద్ద ఆఫీసర్లు, వర్తక ప్రముఖులు - ఇలా మిత్ర జన సందోహమే గాకుండా, స్వయంగా ఆయనదే ఒక బంధు సముద్రమై పోయింది గదా! పెద్దకొడుకుది హోటల్ బిజినెస్సు. ఒకే పేరుతో నాలుగు పట్టణాల్లో లాడ్జింగు సదుపాయాలతో సహా అతడికి హోటళ్ళున్నాయి. రెండో కొడుకు, కోడలు డాక్టర్లు. ఇరవై అయిదు పడకలతో హిందూపురంలో పెద్ద నర్సింగు హోం నిర్వహిస్తున్నారు. మూడో అబ్బాయిది విద్యాశాఖ. అంటే రెసిడెన్షియల్ స్కూలన్నమాట. గూడూరుకీ నెల్లూరికీ మధ్య చిట్టడివిలో పదెకరాల స్థలం సంపాదించి అల్లావుద్దీన్ అద్భుత మందిరాల లాంటి కట్టడాలు నిర్మించి, వెయ్యి మంది విద్యార్థులతో అతడు ఎల్‌కేజీ నుండి ఇంటరు దాకా విద్యా సంస్థల్ని నడుపుకొస్తున్నాడు. నాలుగో కుమారుడు ఇంజనీరు. అనేక అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించి, విడివిడిగా ఫ్లాట్స్ అమ్మేస్తూ రాష్ట్ర రాజధాని నగరంలో అతడు ఇళ్ళులేని వాళ్ళకు స్థిరమైన ఆశ్రయ వసతి కల్పిస్తున్నాడు. వీళ్ళు గాక ఇంకా ముగ్గురు కుమార్తెలు గూడా ఉన్నారంటే, వాళ్ళది సైతం పుట్టింటి వైభవాలకు మెరుగులు దిద్దగల ఫాయిదాయే! ఇంకా వియ్యంకులు, బావమరుదులు, వాళ్ళ బంధువులు - ఇలా ఎందరో సకుటుంబంగా తరలి వచ్చేశారు.

అన్నట్టు ప్రస్తుత విశేషమేమిటో చెప్పాలి గదా. వివాహ స్వర్ణోత్సవమన్న మాట! రాజభూషణం గారికి వివాహమై యాభైయేళ్ళు నిండిన సందర్భం. పిలుపు అందుకున్న వాళ్ళందరూ పగ్గాలు తెంచుకుంటున్నట్టుగా పరతెంచి వచ్చేశారు. కానీ, నాకొకటే ఆశ్చర్యం. అందరిలోనూ రాజభూషణం గారు నన్నొక కంట కనిపెడుతున్నారంటే ఏమనుకోవాలి? పెద్దవాళ్ళ గొప్ప బుద్ధి వాళ్ళు చిన్నవాళ్ళ పట్ల వ్యవహరించే విధానం వల్ల తెలిసిపోతుందంటారు గదా! ఆ మాట రాజభూషణం గారి పట్ల ఎంతటి అక్షరసత్యం!

ఫంక్షను ముగిసింది. అందరూ వెళ్ళిపోయారు. సద్దు మాటుమణిగింది. మేడ ముంగిట పూలతీగలల్లించిన పందిరి కింద వాలుకుర్చీలో పడుకున్న రాజభూషణం గారిని సమీపించాను.

"ఏమిటోయ్ కామేశం! ఎట్లాగైనా రెండురోజులపాటు నీ డ్యూటీతో సర్దుకోగలవా? మద్రాసు వెళ్ళొచ్చేద్దాం" కనిపించగానే మొదలెట్టాడాయన.

ఎలా సాధ్యం? నగర విలేఖరినైపోయాను గదా. సరిగ్గా ఆ రెండు రోజుల్లోనే స్థానిక

రాజకీయాల్లో కొన్ని లింకులు తెగిపోవచ్చు. కొత్త ముళ్ళు కొన్ని బిగుసుకోవచ్చు. నకిలీ డాక్టరు ఒకడు కోమాలో ఉన్న రోగికి విషపు సూది ఎక్కించవచ్చు. భయంకర బీభత్స సినిమా ప్రదర్శనల ద్వారా ప్రభావితుడైన పన్నెండేళ్ళ కుర్రాడొకడు పడుకున్న నలభైయేళ్ళ వ్యక్తి తలపైకి బండరాయి దొర్లించవచ్చు. 'తాగిన జీపు' ఒకటి ఎదురుగా వస్తున్న ఆటో పైనుంచీ పారిపోవచ్చు. ఉదయకాలపు ఉపాహారాలకంటే ముందుగా నేనీ వార్తారాజాలను ప్రియ పాఠకులకు చేరవేసి మనోరంజనం కావించకపోతే ఇంకేమైనా ఉందా? కాలచక్రం ఆగిపోదా? ఇదంతా రాజభూషణం గారికేమైనా తెలియని విషయమా? అయినా, ఆయన ఎట్లాగైనా రెండు రోజులు సర్దుకోమంటే ఏం చెప్పగలను?

అయితే ఒకటి. పొడుపు కథ వేయడంతోబాటు విప్పడం గూడా ఆయనకు చేతనౌను.

"పరవాలేదులేవోయ్! నీకు పైసా ఖర్చుండదు. ఆన్ డ్యూటీ మీద నా కార్లోనే రావచ్చు. ఆదివారం అనుబంధాలకు నువ్వెట్లాగూ అప్పుడప్పుడూ ప్రత్యేక వ్యాసాలు సరఫరా చేయాలి గదా! ఓల్డ్ ఏజ్ హోం పైన ఒకటి రాసుకుందువు గానీలే! వాళ్ళతో మాట్లాడి అన్ని వివరాలూ నీకు లభించేటట్టు చూచే పూచీ నాది. ఫోటోగ్రాఫరును అక్కడే కుదుర్చుకోవచ్చు. నువ్వు లేనప్పుడు డ్యూటీలో ఉండడం కోసం ఒక రిలీవింగు రిపోర్టరు నియామకం అయ్యేటట్టు చూచుకుంటే చాలు. ఏం సరేనా?"

ఆనందంతో నేను కాస్తా తబ్బిబ్బు పడిపోయాను. ఉదయం లేచింది మొదలు పొద్దుపోయే దాకా నెగెటివ్ వార్తలతోనే పత్రికను ఫీడ్ చేసే నాకు ఓల్డేజ్ హోం అనేది ఒక ఆనందాల కొలువుగానూ, అందాల నెలవుగానూ తోచింది. ఆదినుంచీ అవ్యవస్థలో వ్యవస్థను, చెడులో మంచిని అన్వేషించడం నా హాబీ. పైగా ఇలాంటి సత్కార్యం కోసం రాజభూషణం గారి వెంట వెళ్ళడం ఎంతటివారికి కలిగే భాగ్యం!

ఓ నగర్ బస్ స్టేషను సమీపంలో ఒక పెద్ద హోటల్లో బస చేశాము. సాయంకాలం వస్తున్నట్టు రాజభూషణం గారు ఓల్డేజ్ హోం వాళ్ళకు ఫోన్ చేసి చెప్పారు. ఒకానొక దినపత్రికల్లో ఆశ్రమం గురించి సచిత్రవ్యాసం ఒకటి ప్రచురించే ఉద్దేశ్యంతో ఒక విలేఖరిని గూడా తీసుకొచ్చినట్టు తెలియజేశారు. 'ఇంటర్వ్యూ సంగతి రేపు చూద్దాంలెండి! ఎలాగూ ఒక ఫోటోగ్రాఫరు గూడా రావలసి ఉంటుంది. ఇప్పుడు సాయంకాలం రావడం నా మామూలు ట్రిప్పుగానే భావించండి" అన్నారు.

దారిలో ఒకచోట ఆగి ఒక గెల అరటిపళ్ళు అట్టపెట్టె నిండుగా బిస్కెట్ పొట్లాలు, రెండు చాక్లెట్టు టిన్నులూ కొని డిక్కీలో వేయించుకుని మేము బయల్దేరే టప్పటికి ఉద్యోగులు కార్యాలయం నుంచి ఇంటిముఖం పడుతున్నారు. నగరం శివారులో బిసెంట్ నగర్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రశాంతమైన వాతావరణం నడుమ, కొబ్బరి చెట్ల ఆవరణలో వృద్ధాశ్రమం ఒక మునిపల్లెలా కానవచ్చింది. కారు నిలిచేసరికి వార్డెను పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"వణక్కం సార్! దయసేయండి, దయసేయండి!"

స్వాగతం చెప్పి అతడు మమ్మల్ని తన గదిలోకి చేరవేశాడు. ఈలోగా కారు డ్రయివరు డిక్కీలోని తినుబండారాలు గూడా ఆఫీసు రూంలోకి తరలించాడు.

"అయ్యా, వరదాచారీ, ఇవి ఆశ్రమ వాసులకోసం" అన్నారు రాజభూషణం గారు.

వరదాచారి వినయం మూర్తీభవించిన పరమ సాధువులా ఉన్నాడు. ముఖ్యమైన విషయమేదో చెప్పేసి, బరువు నుంచి విముక్తుడు గావాలన్న వేగిరపాటు అతడి ముఖభంగిమలోనుంచి తొంగిచూస్తోంది.

"రాజభూషణం సార్! మీ మంచి మనసుకు రొంబ నన్రి సార్! మాసమాసం లెటరు వేస్తా ఉంటాను గద సార్. మీకు తెలియందేముంది? పొజిషన్ రొంబ మోసమై పోయిడ్చింది సార్! ఎవురు

కనబడినా వాళ్లని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోస్తాది. సాంబారులో ఉప్పు లేదనో, పచ్చడి వెయ్యలేదనో కంచం ఎత్తిపట్టి బయటికి విసిరేస్తాది. మీరాబాయమ్మను కంట్రోల్లో పెట్టడం మావల్ల మాలేటట్టు లేదు. రొంబ సారీ సార్!" వరదాచారి ఏడుపు ముఖం పెట్టేశాడు.

రాజభూషణం గారు అయిదు నిమిషాల దాకా ఆలోచిస్తూ ఉండిపోయారు. తర్వాత కుర్చీలో కొంచెం కదిలి, బల్లపైకి వంగుతూ "ఇప్పుడేం చేస్తోంది" అని ప్రశ్నించారు.

ఆయాలాంటి ఆడమనిషి పరుగెత్తుకుంటూ వెళ్ళి వచ్చి చెప్పింది.

"తూంగుదు సార్! నాను...."

"చూస్తిరా సార్!" వరదాచారి అందుకున్నాడు. "రాత్రిలో నిద్రపోదు సార్. అవి పాట్టులా, కీర్తన్లా! ఒకటే రంపుగద సార్! అక్కం పక్కం వాళ్ళు నిద్రపట్టకుండా పడుకునే దానికి ఆఫీసు రూములోకి దూరి వచ్చేస్తురు సార్!"

"ఎప్పుడు లేస్తుంది?"

"నానుదా లేపి కూచోబెట్టిని. నిన్ను చూచే దానికి ఒక అయ్యా వస్తారే, ఆయన వచ్చి ఆఫీసు రూంలో ఉండారని గూడా చెప్తిని" అంది ఆయా.

"అందుకేమంది?"

"వొద్దు సార్! ఆ మాటలు నా నాట్లో రావు సార్. దేవుడు మాదిరి ఆళు మీరు. మిమ్మల్ని పట్టుకొని నోటికొచ్చిన మాటంతా అంటాదే. ఆ మనిషికి మంచి గతులుంటాయా?"

"అబ్బే మతి స్తిమితం లేని మనిషి చేష్టల్ని పట్టించుకోవచ్చా! ఏప్పుడో ఎనభై దాటింది. ఇంక బతికినంతకాలం బతుకుతుందా? విసుక్కుంటే ఎలా? మానవ కారుణ్యం ఉండనక్కర్లా! మీరందరూ ఇక్కడే ఉండండి వెళ్లొస్తా". మమ్మల్ని వారిస్తూ ఆయన బయటికి వెళ్ళిపోయారు.

కానీ, నోటికి తాళం బిగించి, కాళ్లు ముడుచుకుని నేనెంతోసేపు నిశ్శబ్దంగా కూచోలేకపోయాను. "వరదాచారి గారూ! ఎవరండీ ఈమె? రాజభూషణం గారి కేమవుతుంది" అని ప్రశ్నించాను.

"అయ్యో సామీ! ఆ మాటెందుకు సెప్తురు? సూడబోతే దోవనుబోయే పీడనుతెచ్చి ఈయన తలకు చుట్టుకొన్నట్టే ఉండాది...."

అనాథ ప్రేత సంస్కారం వల్ల కోటి యజ్ఞాల ఫలితం సమకూరుతుందని మునుపటికెవరో చెప్పారు. అలాంటప్పుడు జీవించి ఉన్న ఓ అనాథకు వృద్ధాశ్రమంలో నెలవేర్పరచి, ఎప్పటికప్పుడు ఆమె బాగోగులు శ్రద్ధగా కనిపెట్టి ఉండడం మాత్రం సామాన్యమైన విషయమా? అలాంటి సౌజన్యమూర్తిని పట్టుకుని ఈ ముసల్ది నోటికొచ్చినట్టల్లా దుర్భాషలాడుతుందా? ఏం చేసినా తప్పు లేదు ఈవిణ్ణి. అమాంతంగా పైనబడి గొంతు నులిమి చంపెయ్యాలన్నంత ఉక్రోషం నాలో బుసలు కొట్టింది.

"పిచ్చిమనిషి కద సార్, అయిదారు సమ్మత్సరాలకు ముందు ఇక్కడ చేర్చినప్పుడే కొంచెం పిచ్చి ఉండేది. ఇప్పుడు రొంబ ముదిరిపోయింది. కీల్పాక్కంలో పిచ్చోళ్ళకని హాస్పిటలుంది గద సార్! అక్కడికి పంపించేస్తే పోతుందనిదా అనుకుంటూ ఉంటాను. అయ్యా ఏమంటారో ఏమో! అదే నా భయం..."

"నేనొకసారి వెళ్ళి చూచొద్దునా" అన్నాను. నా ఆసక్తి అప్రయత్నంగానే బయటపడిందని చెప్పాలి.

"పరవాలేదు వెళ్ళి చూచి రండి సార్! రూములోకి పోద్దు. బయట కిటికీలో నుంచే చూడొచ్చు.

రూం నెంబరు ట్వెంటీ టూ."

కిటికీవైపు వీపు తిప్పి రాజభూషణం గారు గాడ్రెజ్ కుర్చీపైన కూర్చున్నారు. ఆయన ఎదుట ఇనుప మంచం పైన బట్ట కప్పుకున్న ఎముకల గూడులా ఓ స్త్రీ ఆకారం వానలో తడిసి రెక్కలు ముడుచుకుని కూర్చున్న పక్షిలా ఉంది. జీవశక్తినంతా కంఠంలోకి తెచ్చుకుని, శబ్ద ప్రసారం ద్వారా బహిర్గతం చేస్తున్నట్టు ఆమె మాటలు మాత్రం ఖంగు ఖంగు మని మ్రోగుతున్నాయి.

'సరే అదంతా అట్లా ఉండనీ! ఇప్పుడు నువ్వెందుకొచ్చినావని అడుగుతున్నా ముసల్ది బతికే ఉందో చచ్చిందో చూచి పొయ్యేదానికొస్తివా? చచ్చినా నేను వదిలిపెట్టనులే! పిశాచినై పీడిస్తాను. ఎక్కడ పుట్టినోళ్ళురా మీరు? ఎవరికి పుట్టినోళ్ళురా మీరు? మీకు పంచభక్ష్య పరమాన్నాలున్నూ, నాకు చప్పిడి సాంబారు తిండా? ఈ బియ్యం మనుషులు తినేదేనా? ఈ మిరియాల చారు కుక్కలు తాగుతాయా? నేను నిన్నేమీ అన్లేదు. ఇంకొకణ్ణి ఏమీఅనను. నన్నీ గతికి తెచ్చిన వాళ్ళనంటాను. నా గోడు వాళ్ళకెదగదా? వాళ్ళ కొంప మీద గూబ కుయ్యదా? వాళ్ళ లోగిట్లో ఉమ్మెత్తలు మొలవ్వా? వాళ్ళు నాశనమైపోరా? నా కడుపు కాలినట్టే వాళ్ళ కడుపు కాలదా? అందరూ చేరి నాకన్యాయం చేస్తార్రా? నా కన్యాయం చేస్తారా? నాకు ... నాకు..."

పుల్లల్లాంటి వేళ్లతో ఆమె రొమ్ము బాదుకోసాగింది. ఆ తాకిడికి పక్క ఎముకులు పుటుక్కు పుటుక్కున విరిగిపోతాయేమోనని నేను కలవరపడి పోయాను. వీధుల్లో గారడీ పని చేసే వాళ్ళు పెళ్ళాం గొంతు కోసెయ్యడం, కొడుకు నాలుక కత్తిరించడం లాంటి అఘాయిత్యాలు చేస్తూ ఉంటారు. ముసలిదాని చేష్టలంతకన్నా సున్నితంగా లేవు.

గిరుక్కున వెనుదిరిగి దూరంగా వచ్చేశాను.

ఆ రోజు రాత్రి నాకు సరిగ్గా నిద్ర పట్టలేదు. కలత నిద్రలో కలలతోనే తెల్లవారి పోయింది.

ఉదయకాలపు కృత్యాలన్నీ పూర్తయ్యాక రాజభూషణం గారు అన్నారు.

"చూడవోయ్ కామేశం! వరదాచారితో చెప్పి వచ్చాను. అతడు నీక్కావలసిన వివరాలన్నీ అందచేస్తాడు. అదనంగా పది రూపాయలు పారేస్తే ఫోటోగ్రాఫరు గూడా దొరక్కపోడు. నీ పని నెరవేరడం ముఖ్యం. అన్నట్టు ఈ డబ్బు నీ దగ్గరుంచుకో. ఇదిగో చీటి. ఇందులోని సామాన్లు కొనుక్కెళ్ళి వరదాచారి కప్పగించు..."

కారులో వెళ్తూ చీటీ విప్పి చూచాను - "వాటర్ డ్రమ్ ఒకటి. స్టీలు టంబ్లర్లు రెండు, బెడ్‌షీట్లు రెండు, తలగడ ఒకటి, వాలుకుర్చీ ఒకటి, గార్డెన్ చేర్ ఒకటి..."

నిజం చెప్పాలి గద నా కళ్ళను నేను నమ్మలేక పోయాను. నీటిలో కరిగే లవణానికి ఓ పరిమితి ఉంటుంది. ఆ పరిమితి మీరినప్పుడు ఇక లవణం నీటిలో కరగదు. లవణంలాగే ఉండిపోతుంది. మానవ వ్యక్తిత్వంలో ఇమిడిపోయే మంచితనానికి అట్లాగే ఓ హద్దు ఉంటుంది. ఆ హద్దు దాటిన మంచితనానికి చెల్లుబాటుండదని రాజభూషణం గారికి తెలియదా? తెలిసినా సరే, తానెన్నుకున్న మార్గాన్ని ఆయన వదలిపెట్టడా? ఇదేమిట్రా బాబూ, భగవంతుడు కావించిన మానవ సృష్టిలో ఇలాంటి విలక్షణమైన నమూనాలు గూడా ఉంటాయా? ఉంటాయని చెబితే ఎవరైనా నమ్మగలరా? అలాంటి సంశయాత్ముల ఆంతర్యాన్ని సవాలు చేయడానికైనా, రాజభూషణం గారి అంతరంగికుణ్ణిగా నేనేమీ చేయలేనా? ఎందుకు చేయలేను? ఆయన జీవితంలోని విశేష సంఘటనల్ని గ్రంథస్థం చేస్తే చాలదా? ఎట్లాగూ ఆరు నెలల్లో ఎన్నికలు రానున్నాయి. రాజభూషణంగారు అసెంబ్లీకి పోటీచేయడం ఇంచుమించుగా ఖరారైపోయింది. నామినేషన్ వేసే సరికల్లా ఈ పుస్తకం నియోజకవర్గంలోని

ప్రతి విద్యావంతుడి చేతిలోనూ ఉండాలి. అదే రాజభూషణం గారికి నేను సమర్పించ గలిగిన సముచిత నివాళి.

ఒక ఊహ మానవుడి కెంతటి ఉత్తేజాన్ని చేకూర్చగలదో నాకప్పుడే తెలిసొచ్చింది. ఈ ఊహ కలిగినప్పటినుంచీ నాకదే ధ్యాసై పోయింది. అత్యవసరమైన వ్యవహారాలపైన బయటకు వెళ్ళవలసి వచ్చినప్పుడు తప్పితే మిగిలిన సమయాల్లో నేను నా గదిలో స్క్రిప్టు పనిపైన కూర్చున్నాను.

జీవితంలో అవి మహా జ్వర ప్రకోపానికి లోనైన సన్నిపాతపు రోజులై పోయాయి. భావ తీవ్రత బుద్ధిని ఊపి పారేసింది. ఒకనాటి మిట్టమధ్యాహ్నం మండుటెండలో నెల్లూరు స్టోనుహవుసు పేటలోని ముకుంద రామయ్య గారికోసం వెళ్ళి, తండ్రి ఇంట్లో లేని సమయంలో ఆయన కుమార్తె నెరపిన ఆతిథ్య సత్కారానికి మురిసిపోయి, ఆ అమ్మాయిని పెళ్ళాడేదాకా రాజభూషణం గారు ఒంటికాలిపైన నిల్చున్న వైనమూ, గుళ్ళ నిర్మాణం, తుపాను బాధితుల సహాయనిధీ, కాందిశీకుల పునరావాసం, ఇంకా ఎన్నో కారణాలపైన తనను వెదుక్కుంటూ వచ్చేవాళ్ళని ఆయన సంతోషపెట్టి సాగనంపే పద్ధతీ, అంతెందుకు - జనారణ్యంలో నిరుద్యోగిగా తిరుగుతూ విసిగి వేసారిపోయిన నాకు పత్రికలో కొలువు దొరకడానికి చేసిన దోహదమూ - ఇలాంటి సంఘటనలెన్నో 'నన్నెన్నుకోవూ, నన్నెన్నుకోవూ' అంటూ వచ్చి కథనంలో ఒదిగిపోయాయి. నేనూ, నేనూ అంటూ పదాలు వాటంతటవే పోటీపడి, ఎగిరివచ్చి, తమస్థానాల్లో అతుక్కుపోయాయి. నెల రోజులపాటు జ్వరంతో పడిలేచిన తర్వాత పథ్యం పుచ్చుకున్నట్టుగా చిత్తుప్రతిలో అవసరమైన చోట్ల మార్పులూ, చేర్పులూ గూడా చేసి, ప్రెస్ కాపీ సిద్ధం చేసేశాను.

ఈ దశలో నేను గోభూమి సత్యారావు గారిని కలుసుకోదలచుకున్నానంటే అందుకు కారణం - ఒకే రాతితో రెండు పిట్టల్ని కొట్టాలనుకోవడమే. 'గోభూమి' అనేది ఇంటిపేరు కాదు. అది నలభై యేళ్ళుగా ఆయన నడుపుకొస్తున్న స్థానిక వారపత్రిక పేరు. అందువల్ల ఒరిగిందేమీ లేకపోయినా, ప్రతిష్ఠకోసం ఆయన పత్రికను నడుపుతున్నారని చెప్పుకుంటారు. ఎటొచ్చీ పత్రికవల్ల వచ్చే నష్టాన్ని పూడ్చుకోడానికి ఆయనకొక ప్రెస్సుంది. ఆ ప్రెస్సు పేరు కూడా గోభూమే. వాళ్ళ ప్రత్యేకత కరపత్రాలు, పెళ్ళి పత్రికలకే పరిమితమైనప్పటికీ, వంద పేజీల పుస్తకం ఆచ్చేసి ఇవ్వడం కూడా వాళ్ళకు అసాధ్యమేమీ కాదు. పుస్తక ముద్రణతో బాటు, ఆయనచేత ముందుమాట గూడా రాయించుకోవాలన్నది నా సంకల్పం. ముందుమాట వల్ల అసలు రచన విలువ అతిశయించడం నేను కొన్ని పుస్తకాల విషయంలో గమనించి ఉన్నాను.

ఈ పని పైన నేను సత్యారావును కలుసుకున్నది రెండుసార్లు మాత్రమే. మొదటిసారి దాదాపు నేనే మాట్లాడగా ఆయన వింటూ కూర్చున్నారు. రెండోసారి మాట్లాడే వంతు ఆయనదే అయిపోయింది.

'సమాజాభరణం రాజభూషణం' అన్న నా పుస్తకాన్ని (అదే నేను జీవిత చరిత్రకు పెట్టిన పేరు) తిప్పి చూచిన సత్యారావు "మంచిది నాయనా! పుస్తకాలు అచ్చెయ్యడానికే గదా ప్రెస్సుండడం. ఆ పని మేము నిరభ్యంతరంగా చేసి పెట్టగలం. కానీ, ముందుమాట రాయాలంటే ఒకసారి చదవాలి గదా. నువ్వు మళ్ళీ రెండు రోజుల్లో నన్ను కలుసుకోగలవా" అన్నాడు.

"ఎంతమాటెంతమాట: పుస్తకం చదవకుండా ముందుమాట రాసి పెడతారా ఎవరైనా" అని, నా ఆశయం నేననుకున్నట్లుగానే నెరవేరుతోందన్న ఆనందంతో సంతృప్తిగా తిరిగి వచ్చేశాను.

మూడో రోజున నేనాయన కార్యాలయంలో అడుగుపెట్టేటప్పటికే నా రాక కోసమే వేచి ఉన్నట్టుగా "రా, నాయనా! రా, కూచో" అంటూ ఆయన ఆప్యాయంగా ఆహ్వానించారు. కూచున్నాక

"నువ్వేమో నన్ను ప్రొలోగ్ రాయమన్నావు. నీ పుస్తకం చదివి చూచిన తర్వాత నాకేమో ఎపిలోగ్‌రాస్తే బాగుండుననిపిస్తోంది" అన్నాడు.

చెప్పిన పని చేయకుండా మధ్యలో ఈయన తన ప్రయోజకత్వం కొంచెం వెలగబెట్టాలనుకోడమెందుకో నా కర్థం కాలేదు. తటాలున కొంచెం చిరాకు కలిగినా తమాయించుకుని "ఏదైతేనేం లెండి" అన్నాను.

"అవునవును. గొంతు కోసుకోవడానికి ఏ కత్తి అయితేనేమి!" మహానుభావుడు సత్యారావు ఎదుటివారి గుండె లవిసిపోయేటట్టుగా నవ్వసాగాడు. నవ్వే తీరునుబట్టి ఆయనలో ఉన్మాద లక్షణాలేవో ఉన్నట్టు తోచి, నేను కుర్చీలో సర్దుకుని కూర్చున్నాను.

నవ్వి నవ్వి గాలి తీసేసిన బెలూను టప్‌మని ప్రిదిలిపోయినట్టుగా, ఆయన చప్పబడిపోయాడు. నరసింహావతారంలోనుంచి వామనావతారంలోకి మారినట్టుగా ఈసారి చాలా నింపాదిగానే ప్రారంభించాడు. "నాయనా కామేశం! విజయమనేది సముద్రంలో తేలే మంచుగుట్టలాంటిది. అందులో కనిపించేది తక్కువ. కనిపించనిదే ఎక్కువ. అన్నట్టు నువ్వు నారగింటి మోహనరంగం గారి పేరు విన్నావా ఎప్పుడైనా?"

నాకు మతిపోయింది. ముందుకూ వెనక్కూ పొంతన లేకుండా మాట్లాడ్డం ఈయనకే చెల్లింది. నిజంగా కొంచెం మెంటల్ కేసే అయి ఉండాలి. ఎరగక పోయి ఇక్కడికొచ్చి ఈయన దగ్గర తగులుకున్నామేమిట్రా బాబూ అనిపించింది. అయితే ఒకటి. ఆయన ధోరణి అయోమయంగానే ఉన్నప్పటికీ, ఆయన తెచ్చిన ప్రసక్తి అసందర్భంగానే ఉన్నప్పటికీ నారగింటి మోహనరంగం గారిని గురించి మాత్రం నాకు తెలియక పోలేదు. మా దినపత్రికకు ప్రత్యేక అనుబంధం ఒకటి తయారు చేస్తూ ఒకసారి జిల్లాలోని ప్రాచీన సంస్థానాల చరిత్రను సేకరించ వలసి వచ్చింది. అప్పట్లో బయట పడిందే నారగిల్లు. సంస్థానం మరీ చిన్నదైతే దేశవాళీ పలుకుబడిలో దానిని 'పాళ్య' మంటారు. జమీందారులు రద్దయ్యే టప్పటికి నారిగింటి వాళ్ళ ప్రాబల్యం బాగా తగ్గిపోయింది. వరుసగా ముగ్గురు 'సంస్థానాధిపతులు' తలకు మించిన దుబారా ఖర్చులు చేసి చాపంత సొంత ఆస్థిని చదరంత సైజుకు తెచ్చేశారు. ఆ వంశంలో చివరివాడు మోహనరంగం. జమీందారు గాకపోయినా, అతడొక మోస్తరు భూఖామందు గాకపోలేదు. పొలమూ పుట్రా తోటా దొడ్డీ కలిసి వంద ఎకరాలు, నారగిల్లులో పెద్ద మిద్దీ నగా నట్రా అంతా కలిపితే పాతిక లక్షలకు తగ్గని స్థితి. అదిగూడా యాభైయేళ్ళనాటి మాట.

"తెలియకేమండీ! మా డైలీకి పాత చరిత్రలు తవ్వి వ్రాసేవాణ్ణి నేనే గదా? అయినా, ఇప్పుడా మోహనరంగం గారి గొడవెందుకు మనకు" అన్నాను నిరాసక్తంగా.

"ఓహో, అట్లాగా మరీ మంచిది" అని కాసేపాగి ఉన్నట్లుండి ఓ బాంబు పేల్చేశాడు. "ఎందుకంటే నువ్వు ఓల్డ్ ఏజ్ హోంలో చూచావే మీరాబాయమ్మ, ఆవిడ సాక్షాత్తూ మోహనరంగం గారి భార్యే?"

నేను అదిరిపడి కుర్చీలో నిటారుగా కూర్చున్నాను. "అదేమిటంటడీ! మీరాబాయమ్మ మోహనరంగం గారి భార్యా? ఆమెకా దుస్థితి ఎందుకొచ్చింది సార్? ప్లీజ్, చెప్పరూ" అని గింజుకున్నాను.

"కొన్ని పుట్టుకలుంటాయి. రాహుకేతువుల్లాంటివి. అమృత మెట్లాగో, జీవితానందమూ అట్లాగే. కొందరి విషయంలో అది నిరాకరించబడుతూ ఉండడం మనం చూస్తున్నదే. మనుషులు, పరిసరాలు, పరిస్థితులూ అన్నీ కలిసి కుట్ర చేసినట్టుగా కొందరి జీవితాలు కనీసపు సుఖసంతోసాలకు సైతం

నోచుకోక వక్రమైపోతూ ఉంటాయి. అవును. బాల్యం, యౌవనం, కౌమారం, వృద్ధాప్యం - అన్ని దశలూ ఆమెనలాగే అనుగ్రహించాయి. బిడ్డ ఆణిముత్యం. మణిదీపం. పెద్ద భవనాల్లో ఉండదగింది. కానీ, సూర్యచంద్రులు తొంగి చూచే పాత పెంకుటింట్లో పుట్టింది. మంచి తిండికి, మంచి బట్టకు కరవైన దరిద్ర దేవత ఒడిలో పెరిగింది. అయితే, తమ కుమార్తె రూపం చూచి, గుణం చూచి ఎవరో రాకుమారుడు అల్లుడుగా వస్తాడని తల్లితండ్రులు ఆశించారు. వాళ్ళ కల నిజమైంది. ఆ రాకుమారుడు మోహనరంగం రూపంలో విచ్చేశాడు. అమ్మాయి గూడా ఎన్నెన్నో ఆశలతోనే అత్తవారింట్లో ప్రవేశించింది. అయితే, ఆ మహిడీలో కుడికాలు మోపుతుండగా పెదవులపైన మెరిసిన దరహాసమే ఆమె ఆఖరు చిరునవ్వు అవుతుందని ఎవరనుకున్నారు? ఆ నవ్వు మాసిపోయింది. ఆ ముఖం చిన్నబోయింది. ఆ కళ్ళు కొడిగట్టిన దీపాలై పోయాయి. ఎందుకు? ఎందుకని? అత్తగారి అదుపా? కాదు. ఆడపడుచుల ఆరడా? కానేకాదు. భర్త ఏమైనా దుర్మార్గుడా? రామ రామ! అలాంటి మాట చెప్పడానికే వీల్లేదు. షడ్రుచుల్లో ఏ ఒక్కటీలేని ఆహారం ఎంతటి సాత్వికమో అంతటి సాత్వికుడు. లీలలందను బొంకులు లేనివాడని ప్రహ్లాదుణ్ణి గురించి అనలేదా? అట్లాగే చేయిపడితే భార్య కందిపోతుందేమోనని శృంగార లీలలైనా తలపెట్టనివాడు. స్పష్టంగా చెప్పాలంటే, ఆ జోలి బొత్తిగా లేనివాడు..."

"ఏమండీ, నిజమా?" నా ప్రశ్న నాకే నూతిలోనుంచి వినవచ్చిన గొంతుకలా వినిపించింది.

"ఆమె ముఖంలో కాంతిలేకపోయిన మాట నిజం. దాదాపు పదేళ్ళు గడిచినా ఆమెకు బిడ్డలు లేకపోయిన మాట నిజం. ఆ మాత్రం కారణాలు చాలవా నాయనా?"

తల దిమ్మ దిరిగిపోయింది. కొద్ది నిమిషాల తర్వాత ఆయనే కొనసాగించాడు - "వీలయినంత వరకు మోహనరంగాన్ని దోచుకు తినాలనుకున్న రక్తబంధువులు, ఆ దంపతులకు బిడ్డలు కలిగే అవకాశం లేదని తెలిసిపోయాక తమ ఎత్తుగడను మార్చుకున్నారు. ఎట్లాగైనా ఆస్తి పూర్తిగా తమకు దక్కేదేగదా అన్న ఊహ వాళ్ళలో మొక్కై, మానై పెరగసాగింది. అడవి జంతువులు తిండికోసం పోరాటానికి దిగినప్పుడు కొన్ని చావగా, కొన్ని పారిపోగా ఆఖరికొక బలమైన జంతువు మాత్రం మిగిలిపోతుంది గదా! అట్లా దగ్గరి బంధువుల్లో ఒక్కడు మాత్రం చివరిదాకా నెగ్గుకొచ్చాడు. పాపాల భైరవుడు కదా, పాపారావే ననుకుదాం. పాపారావు నికార్సయిన కార్యవాది. భర్తద్వారా బిడ్డల్ని పొందడానికి వీల్లేకపోతే మార్గాంతరం ఉందని అతడికి తెలుసు. ప్రాచీనులు దానికి పెట్టిన పేరు దేవర న్యాయం. ఇతరుల ద్వారా పొందడమన్నమాట. అలాంటి దారుణం జరిగిపోకుండా, శీలపరిక్షణ కావించడం కోసం పాపారావు మీరాబాయి చుట్టూ కత్తుల బోనులాంటి కాపలా వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఆ బందిఖానాలో ఆమెది పంజరంలో రామచిలుక బ్రతుకై పోయింది. మిద్దెపైన మండపంలో వేలాడే పంజరం. అందులో నుంచి విశాలాకాశం కనిపిస్తుంది. పచ్చటి కొండ కోనలు కనిపిస్తాయి. ఉరకలు వేస్తూ సాగిపోయే నదీప్రవాహం కనిపిస్తుంది. ఎండ, వెన్నెల, నక్షత్రాలు అన్నీ కనిపిస్తాయి. అయితే, ఆకాశంలోని నీలిమ తనదిగాదు. ప్రకృతిలోని పచ్చదనం తనదిగాదు. నది ప్రవాహంలోని చైతన్యం తనది గాదు. కమ్మ తెమ్మెరల సౌరభం తనదిగాదు. పువ్వుల మిసిమి తనదిగాదు. తానన్నటినీ చూడగలదంతే! ఏవీ తనవి గావు. ఏ సంఘటన జరిగినా సాక్షీమాత్రుడుగా చూస్తూ ఊరకుండిపోగల నిష్క్రియాపరుడైన భర్త. తనకు పెళ్ళయిన కొత్తలోనే తల్లిదండ్రులు కూడబలుక్కున్నట్టుగా కన్ను మూయడం వల్ల గత చరిత్రలో భాగమైపోయిన పుట్టిల్లు. పైకి హితుల్లా కనిపిస్తూ, అంతరంగికంగా తన చుట్టూ ముళ్ళకంచెలు వేస్తున్న రాబందుల్లాంటి బంధువులు ఇలాంటి కూపంలో

పడిపోయి ఆమె తన నిట్టూర్పులు తానే వినేది. తన కన్నీళ్ళు తానే తాగేది. తన నిద్రలేని రాత్రుల్లో జాగరణ సల్పుతూ కుమిలిపోయేది. ఓదార్పులేదు. సానుభూతి లేదు. ఆశాకిరణం ప్రసరించని అంధకారం గడ్డిపోచ మొలవని ఎడారి. ఏం నాయనా కామేశం వింటున్నావా?"

కొద్ది క్షణాలకు గానీ నేను తెప్పరిల్లుకోలేక పోయాను. "వింటున్నానండీ! పచ్చని పందిరి మండిపోయే దృశ్యంలా జీవితం నన్ను భయపెడుతోంది. గుండెలపైన పెద్ద బండ ఏదో దిగబడి పోయినట్టుంది. చెప్పండి సార్" అన్నాను.

"వస్తోంది గదా! మలుపొస్తోంది. అలా ఇరవైయేళ్ళు గడచిపోయిన తర్వాత ఆమె హఠాత్తుగా తన యావజ్జీవిత శిక్షపైన తిరిగబడింది. ఎలాగంటావా? మంచినీళ్ళు తెచ్చిపోసే మనిషి ఒకడుండేవాడు. రాయప్ప అని. వాడితో లేచిపోయింది."

హబ్బ ఎలాగైతేనేం కథకు కాళ్ళొచ్చేశాయి. ఎన్ని ఎదురు దెబ్బలు తిన్నా సరే, మనిషి కత ఆగిపోగూడదనే శ్రోత కోరుకుంటాడు. ఊపిరి పీల్చుకున్నాను.

"భౌతిక జీవితంలోని సుఖాలకు, కష్టాలకూ ఉన్న సారమేమిటో రాయప్ప ఆమెకు చూపించ గలిగాడు. ఊళ్ళు తిప్పాడు. లోకం చూపించాడు. ఉద్ధరించేటట్టుగానే కనిపించాడు. ఆ స్థాయి మనుషులకుండే వ్యసనాలన్నీ అతనికి ఉండేవి. పూటుగా తాగేవాడు. పులిజూదం ఆడేవాడు. మట్కా నేర్చుకున్నాడు. అందుకని, ఇందుకని ఒక్కొక్క నగే లాగేశాడు. చేతిలో డబ్బున్నంతవరకూ జల్సాల్లో మునిచితేల్చాడు. కూర్చుని తింటే కొండమాత్రం నిలుస్తుందా? అయిదారేళ్ళకల్లా ఆమె నిరలంకారంగా, వట్టి శరీర మాత్రురాలుగా నిల్చిపోయింది. ఇల్లు గడవడం కష్టమైపోయింది. ఉన్న ఇంటికి అద్దె చెల్లించడం దుస్తరమైపోయింది. కాపురాన్ని తడికల పాకలోకైనా, సత్రపు వసారాల్లోకైనా మార్చడానికి అతడికేమీ ఇబ్బంది ఉండేది గాదు. కూలీ నాలీ చేసిన డబ్బుల్లో ఎక్కువ భాగం అతడి సొంత ఖర్చులకే దఖలైపోగా, మిగిలే చిల్లరను బట్టి మాత్రమే పొయ్యిలో పొగ లేచేది. తినే తిండికి, కట్టే బట్టకు, తలదాచుకునే ఆశ్రయానికి నిప్పచ్చరమేర్పడడమంటే ఏమిటో ఆమెకు తెలిసొచ్చింది. 'జమీందారు పెళ్ళామంటమ్మా! ఒళ్ళు బలిసి వీడితో లేచిపోయి వచ్చింది' అని అమ్మలక్కలు చెవులు కొరుక్కునేవారు. మీరాబాయి ఆ సమాజంలో ఇమడలేకపోయింది. ఆమె నిస్సహాయ స్థితిని గమనించిన మగరాయుళ్ళు కొందరు చొరవతో ఆమెపైన చనువు తీసుకోబోయారు. రాయప్ప వాళ్ళతో పేచీకి దిగి, పొట్టేలులా బరిలోకి దూకేవాడు. చితకకొట్టడానికైనా, చావు దెబ్బలు తినడానికైనా వెనుకాడేవాడు కాదు. ఈ వ్యవహారాల్లో రెండు మూడుసార్లు జైలుకు కూడా వెళ్ళొచ్చాడు. అతడు లేనిరోజుల్లో ఆమె బతుకు మరీ కనాకష్టమై పోయేది. ఒకరింట్లో పాచి పని చేసి, ఇంకొకరింట్లో పశువుల కొట్టాలూడ్చి, చేలల్లో వెరుసెనగ కాయలు ఒలిచి - ఆ విధంగా పొట్ట పోసుకోవలసి వచ్చేది. ఎవరితోనూ మాట్లాడేది కాదు. దేనితోనూ జోక్యం పెట్టుకునేది గాదు. ఎవరైనా పనికి పిలిస్తే వెళ్ళేది. లేకుంటే మంచినీళ్ళు తాగి పస్తు పడుకునేది. 'నరవాసన, నరవాసన' అంటూ రెచ్చిపోయే రక్కసుడిలా రాయప్ప జైల్లోనుంచి ఆవురావురు మంటూ బయటికొచ్చేవాడు. ఈలోగా మీరాబాయి ఏదో సంపాదించి ముల్లెగట్టి ఉంటుందని భావించి, తినడానికి తాగడానికి డబ్బు లడిగేవాడు. ఆమె ఉన్నంతవరకు ఇచ్చేసేది. లేకపోతే ఏం చేస్తుంది? లేదంటే రాయప్ప నమ్మేవాడు గాదు. చేయి చేసుకోవడం గూడా మొదలెట్టాడు. గుద్దులు, తన్నులు ఒంట్లో సత్తువ ఉన్నంతకాలం భరించింది. జవసత్వాలుడిగి పోయిన తర్వాత నోరు చేసుకోకుండా ఉండలేకపోయింది. 'కీ' ఇచ్చి వదిలిపెట్టినట్లుగా ఆ నోరు నిరంతరంగా శబ్దించే యంత్రమైపోయింది. తనను తాను తిట్టుకుంటుందా? తననీ గతికి తెచ్చిన వాళ్ళని తిడుతుందా?

తనను హీనంగా చూచే లోకుల్ని తిడుతోందా? మహానుభావుడు. అన్నింటికీ మూలకారణంగా చెప్పబడే ఆ పరమశివుణ్ణే తిడుతోందా? తెలిసేది గాదు. ఎవరైనా అడిగితే 'నిన్ను కాదులే' అనేది. అలాంటి దుర్దినాల్లో ఒకసారి పీకలదాకా తాగి వస్తూ రాయప్ప రెండు నిలువుల గోతిలో పడిపోయాడు. రాళ్ళు తగిలి కాళ్ళు విరిగాయి. మంచాన పడి ఆరు నెలల పాటు అఘోరించి, మీరాబాయికి నరకం చూపించి తనపాటుకు తాను నిష్క్రమించాడు. రాయప్ప పోయేటప్పటికి వికలమై పోయిన మనసుతో, శిథిలమైపోయిన శరీరంతో మీరాబాయి జీవచ్ఛవంలా మిగిలింది. అరవై సమీపిస్తున్న వయసుతో ఆమె వృద్ధాప్య ద్వారం దగ్గర నిలబడి ఉంది."

నిండా మునిగినవారికి చలేముంటుంది? ఆకలి, ఒంటరితనం, నిస్సహాయత, వంచన, పీడన, తాడన, కర్కశత్వం, హృదయరాహిత్యం - ఇలా ఆమె ఎన్నెన్నో అనుభవాలను చవిచూచింది. ఇకమీదట ఆమెను చెనకగలిగే కొత్త బాధ లేముంటాయి? ఇంకా నయం! చప్పిడి కూరలతోనైనా ఆశ్రమంలో భోజనం పడేస్తున్నారు గదా!

ప్రవాహానికి ఒక పెద్ద బండరాయి ఎదురైనట్టుగా, బుర్రలో ఒక ప్రశ్న తటాలున పొడసూపింది. అన్నట్టీమె ఓల్డ్ ఏజ్ హోంకెలా చేరుకోగలిగి ఉంటుంది? ప్రశ్నార్థకంగా సత్యారావు గారివైపు చూచాను.

"అయ్యా కామేశం! చాలాసేపట్నుంచి మనం ఒక ముఖ్యమైన పాత్రను విస్మరించేశాం. ఎవర్ని గురించో చెప్పగలవా?"

"ఏమండీ, మోహనరంగం గారిని గురించేనా మీరు చెప్పడం?"

"మోహనరంగానికి ముఖ్యపాత్రగా పరిగణన ఎక్కడిది? అయితే, ఎంతటి జడుడైనా అవసానదశలో అతడికీ కాస్తా చావు తెలివొచ్చేసింది. తన ఆస్తిలో పెద్ద వాటా మీరాబాయమ్మకు దక్కాల్సిందేనని హఠం చేశాడు. కానీ, ఈ సదాశయాన్ని కొనసాగ నిచ్చేవాడేనా పాపారావు! 'ఛీ, ఛీ, నీకు బుద్ధుందా? లేచిపోయిన దానికి ఆస్తి కట్టబెడతావా? వంశగౌరవం మంట గలిపింది గదా! కలలోనైనా ఆ మనిషి పేరు తలపెట్టొచ్చునా' అని దులిపి పారేశాడు. ఆరోగ్యం బాగున్న రోజుల్లోనే పాపారావు మాటలకు మారాడలేకపోయేవాడు. కాటికి కాళ్ళు చాచుకున్న స్థితిలో మోహనరంగం ఏం చేయగలడు?

ఒక తల్లి కన్నబిడ్డకు తనవల్ల కలిగిన తీరని నష్టాన్ని తలచుకుని పశ్చాత్తాపంతో దహించుకుపోతూ, గ్రుక్కిళ్ళు మింగి మింగి, కన్నీళ్ళు కార్చి కార్చి కోమాలోకి జారిపోతున్న స్థితిలో పాపారావు చూపెట్టిన కాగితాల పైన సంతకం పెట్టి, మనోవ్యాధితోనే నవసి నవసి ఇహలోకయాత్ర చాలించేశాడు. తన ఆక్రమణలోకి వచ్చిన రాజ్యాన్ని నిశ్చింతగా, నిరాఘాటంగా తానేలుకుంటూ ఉండగా, వేగుల వాడెవడో ఓ వార్త తీసుకొచ్చి పాపారావు చెవిలో వేశాడు. రాయప్ప గూడా చనిపోయాడనీ, ఆ ఊరు ఈ ఊరు తిరుగుతూ, ఆ ఇంటా ఈ ఇంటా అడుక్కుతింటూ మీరాబాయమ్మ తన దిక్కులేని చావు తాను చస్తోందనీ అతడికి తెలిసొచ్చింది. ఆమెకు వాటిల్లిన దుర్దశకు అతడు దురసిల్లిపోయాడని చెప్పలేము గానీ, కొత్త అనుమానం ఒకటి అతన్లో వెంటాడడం మొదలుపెట్టింది. లేచిపోయిన భార్యకు భర్త ఆస్తిపైన హక్కుంటుందా, ఉండదా అన్న సందేహం పెనుభూతంలా అతడిని వెంటాడ సాగింది. లేచిపోయింది సరే, కానీ విడాకులు పుచ్చుకోలేదు గదా! భర్త ఆస్తిపైన హక్కులేక ఎక్కడికి పోతుంది' అని కోర్టుపక్షులు కొందరు తేల్చిచెప్పేశారు. ఈ కిటుకు తెలిసిన ఆసామి ఎవడైనా ముసలిదానికి ఆసరాగా నిలబడి కేసుతో కోర్టు కెక్కితే తనగతేం కావాలన్న సంశయం అతణ్ణి ప్రాణసంకటంలా పట్టి పీడించసాగింది. కార్యసాధకుడికి తెలియని ఉపాయాలా? ఊళ్ళు తిరిగి, వాకబు చేసి

మీరాబాయమ్మ ఉనికిని కనిపెట్టేశాడు. మొసలి కన్నీరు కార్చాడు. ఆమెకు జరిగిన అన్యాయానికంతా మోహనరంగమే కారకుడన్నాడు. ఆ స్థితిలో ఆమెను చూస్తుంటే తన గుండె లవిసిపోతున్నాయన్నాడు. శేష జీవితంలో ఆమెకేలోటూ రాకుండా చూచుకోవడం తన విద్యుక్తధర్మమన్నాడు. తీసుకెళ్ళి వృద్ధాశ్రమంలో చేర్పించాడు...."

"ఏమండీ! అసలింతకూ పాపారావంటే...." అంటూ నేను నివ్వెరపడిపోయాను.

అడ్డు తగిలారు సత్యారావుగారు - "డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్ చదవలేదా? పాపారావంటే మిస్టర్ హైడే! డాక్టర్ జెకిల్ అంటే ఇదిగో ...." నా వ్రాతపుస్తకాన్ని ముందుకు తోస్తూ అన్నారాయన. "ఈయన గారే!"

నా అజ్ఞానమే నన్ను అవహేళన చేయసాగడంతో నా చూపులు కిందకి వాలిపోయాయి. సత్యారావు గారివైపు సూటిగా చూడలేక పోయాను. ఆయన మాటలు సమ్మెటపేటుల్లా కణతలకు సోకుతున్నాయి.

"ఇచ్చిన వివరణ చాలదేమో! మరికొంచెం వివరిస్తా! పెన్నగట్టునగల అయిదెకరాల సుక్షేత్రంతోబాటు, స్టోనుహవుసుపేటలో గల ఇల్లు గూడా తనకే దక్కుతుందని గాకపోతే రాజభూషణం ముకుందరామయ్య గారి కుమార్తెను పెళ్ళాడేవాడేనా? విరాళాల కోసం వచ్చిన వారి పుస్తకంలో నాలుగంకెల సంఖ్య వేసి, ఒక వంద రూపాయల నోటు చేతబెట్టి, తాను వెయ్యి రూపాయలిచ్చినట్టు చూస్తే సాటివాళ్ళు అయిదువందలలైనా ఇవ్వక పోరని భరోసా ఇచ్చి పంపగల లౌక్యం మాత్రం అందరికీ వుంటుందా? ఇకపోతే పత్రికలో నీకు ఉద్యోగం ఇప్పించిన దాఖలా ఒకటుండిపోయింది గదా! ఇప్పించినందుకు నువ్వు చేసిందేమైనా తక్కువా? వాళ్ళ ఇంట్లో పిల్లి సమర్తాడినా ఆ వార్తను పత్రిక కెక్కించావు గదయ్యా! తేరకొచ్చి పడిపోయిన ఆస్తిని పంచిపెట్టి కొడుకులకు సామంతరాజుల హోదా ఇచ్చేశాడు గదా. కానీ ఏది, నువ్విచ్చిన ప్రచారం వాళ్ళివ్వ గలిగారా? ఈ పుస్తకం ఒక్కటే వెయ్యిరెట్ల ప్రత్యుపకారం కాదటయ్యా! ఏమైనా అదృష్టమంటే రాజభూషణం గారిదే! అతణ్ణి గురించి రాయడానికి నీబోటి వాళ్ళెందరైనా ఉంటారు. అయితే, మీరాబాయిని గురించి రాసే అవకాశాన్నయినా మీరు నాబోటి వాళ్ళకు దక్కనివ్వాలన్నది నా కోరిక. ఆమె జీవిత చరిత్ర ద్వారా దురదృష్టవంతుల దుఃఖగాథలకు సంబంధించిన ఒకనిరంతర సత్యాన్ని ఎలుగెత్తి చెప్పుకోవాలని ఉంది. ఏమిటంటావా? ఒకరి అమావాస్యే గదా నాయనా ఇంకొకరి పున్నమి! ఒకరి శిశిరమే గద బాబూ ఇంకొకరికి వసంతం! ఒకరి సమాధిపైనే గదయ్యా ఇంకొకరి అద్దాల మేడ! ఇదే లోక రీతి! ఏమంటావు?"

ఏమనగలను? తలవంచుకుని కూర్చున్నాను. తలనొప్పీ, తలవంపులూ రెండూ ఒకటిగా చేరి నన్ను తల పైకెత్తనివ్వకుండా చేశాయి.

*(ఇండియా టుడే సాహిత్య సంచిక 1995)*